ప్రజాశక్తి
శుక్రవారం 9 మే, 2025
5
శ్రీకాకుళం

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

పార్వతి (ఫైల్)

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి మండలం రావివలసకు చెందిన ఉపాధి హామీ కూలీ పార్వతి (55) గుండెపోటుతో గురువారం మృతి చెందింది. ఎప్పట్లానే గ్రామస్తులతో కలిసి ఉపాధి పనులకు వెళ్లిన పార్వతి, పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. తోటి కూలీలు టెక్కలిలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా, ఆస్పత్రిలో పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పార్వతి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గొట్టాబ్యారేజీకి
మోక్షం కలిగేనా?

- వరద ప్రవాహానికి క్రమేణా దెబ్బతింటున్న ఆప్రాన్
- 2021-22లో రూ.12.91 కోట్లతో ప్రతిపాదనలు
- గతేడాది ఏప్రిల్‌లో ఇంజినీరింగ్ నిపుణుల కమిటీ పరిశీలన
- కొత్త డిజైన్ల మేరకు ప్రతిపాదనలు పంపిన అధికారులు

గొట్టాబ్యారేజీ వద్ద దెబ్బతిన్న ఆప్రాన్ (ఫైల్)

శ్రీకాకుళం జిల్లా హిరమండలం వద్ద వంశధారపై నిర్మించిన గొట్టాబ్యారేజీకి ముప్పు పొంచి ఉందని ఇంజినీరింగ్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. కడప జిల్లాలో 2021 నవంబర్ 19న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో అప్రమత్తమైన ప్రభుత్వం... రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, బ్యారేజీల భద్రతపై 11 మంది సభ్యులతో ఇంజినీరింగ్, సాంకేతిక నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. గతేడాది ఏప్రిల్‌లో మరో కమిటీ సందర్శించి పరిశీలించి, కొత్త డిజైన్లను రూపొందించింది. అందుకనుగుణంగా వంశధార అధికారులు తాజాగా మరోసారి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే టెండర్లను పిలిచి పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద 0.612 టిఎంసిల సామర్థ్యంతో 1977లో బ్యారేజీ నిర్మించారు. బ్యారేజీ ఎగువ భాగంలో ఎడమవైపున 3.6 కిలోమీటర్లు, కుడివైపు 6.2 కిలోమీటర్ల మేర వరద కట్టను నిర్మించారు. బ్యారేజీకి ఆనుకుని దిగువ, ఎగువ భాగంలో 11.06 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ బ్లాక్‌లతో దృఢమైన అప్రాన్‌ను నిర్మించారు. అప్రాన్‌కు సపోర్టుగా పెద్ద పెద్ద బండరాళ్లను కట్టగా పేర్చారు. 2008, 2010 ఆగస్టులో వచ్చిన వరదలతో ఆప్రాన్ క్రమేణా దెబ్బతింటోంది. బ్యారేజీ దిగువ భాగంలో తాత్కాలికంగా మూడు మీటర్ల మేర రాళ్లను వేశారు. బ్యారేజీ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో 2012, మార్చి 26న రూ.3.48 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు మరోసారి బండరాళ్లు కొట్టుకుపోయాయి. 2015లో హైదరాబాద్ నుంచి సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన చీఫ్ ఇంజినీరు సర్వే చేసి, అదే ఏడాది మేలో తనిఖీ నివేదిక సమర్పించారు. బ్యారేజీ దిగువ భాగంలో అత్యవసర రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు పంపిన ప్రతిపాదనలను పరిశీలించిన అప్పటి ప్రభుత్వం రూ.9.72 కోట్లు కేటాయిస్తూ 2017 ఫిబ్రవరి ఏడో తేదీన ఉత్తర్వులను వెలువరించింది. అప్పట్నుంచి పనులు చేపట్టకుండా పాలకులు నాన్చుతూ వచ్చారు. 2021-22 ధరల ప్రకారం దాని వ్యయం రూ.12.91 కోట్లకు చేరింది. ప్రస్తుతం రూపొందించిన డిజైన్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలంటే, రూ.16.50 కోట్లు అవసరం కానున్నాయి. గతంలో ఇచ్చిన జిఒ మేరకు తొలుత పనులు చేయాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. గొట్టాబ్యారేజీలో 22 గేట్లు ఉండగా, ఆ నిధులతో చేపట్టే పనులు 19 గేట్ల వరకు పనులు పూర్తయ్యే అవకాశం ఉందని వంశధార అధికారులు అంచనా వేస్తున్నారు. నిధులు చాలకపోతే తర్వాత సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం సూచించడంతో, అందుకనుగుణంగా అధికారులు కొత్త ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

వరద గట్ల పనులకు క్లియరెన్స్ ఎప్పుడో?

వంశధారకు 80 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిన సందర్భంలో 2023 ఆగస్టులో హిరమండలం బ్యారేజీ దిగువ భాగాన కొంతమేర వరద గట్టు కోతకు గురైంది. గట్టుకు అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం విడుదల చేసిన రూ.10 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వంశధార కాలువ గట్లు ఎంత బలహీనమో 2021, జూలై 15న హిరమండలం వద్ద ఎడమ కాలువ కోతకు గురికావడాన్ని పరిశీలిస్తే తేటతెల్లమవుతుంది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు మట్టి నానిపోవడంతో గొట్టాబ్యారేజీకి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఎలకల మెట్ల సమీపంలో కొంత గట్టు కొట్టుకుపోయింది. అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టినా ఎప్పుడు, ఎలా ఉంటుందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొత్త డిజైన్లకు అనుగుణంగా ప్రతిపాదనలు

గొట్టాబ్యారేజీ దిగువన ఉన్న ఆప్రాన్ పరిస్థితిని గతేడాది ఏప్రిల్ కమిటీ పరిశీలించి కొత్త డిజైన్లను రూపొందించింది. అందుకనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే టెండర్లను పిలిచి పనులు మొదలుపెడతాం. - డి.ఎస్ ప్రదీప్, వంశధార ప్రాజెక్టు నరసన్నపేట డివిజన్ ఇఇ

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

మెళియాపుట్టిలోనే ఐటిడిఎ ఏర్పాటు

- 63 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు అభివృద్ధి
- గిరిజన గ్రామాల్లో రోడ్లు వేస్తాం
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మెళియాపుట్టిలోనే ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని, ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడామని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలోని టి.జి రోడ్డు నుంచి ఎస్.ఎల్ పురం వరకు రూ.2.65 కోట్లతో రోడ్డు, నేలబొంతు నుంచి అనంతగిరి-రింపికి రూ.1.90 కోట్లతో, ఆల్ ఆంధ్ర రోడ్డు నుంచి కూర్మన్నపేట మీదుగా కొత్తపేటకు రూ.92 లక్షలతో రోడ్లకు, మండల కేంద్రంలో రూ.6.28 కోట్లతో ఎంఎస్ఎంఇ పార్కుకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఐటిడిఎ లేకుండా పోయిన శ్రీకాకుళం జిల్లాకు ఐటిడిఎను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టుకు మెళియాపుట్టి రహదారిని అనుసంధానం చేస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో డోలీ వ్యవస్థ తొలగించే విధంగా రహదారులను వేస్తామన్నారు. కుటుంబంలో ఒకరు పారిశ్రామికవేత్తగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల్లోనూ సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తూ చిన్న పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. జిల్లాలో తొలి దశలో పలాస, పాతపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు నాంది పలికిందన్నారు. ఈ పార్కులను ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. దీనివల్ల జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వలసలను నివారించుకోవచ్చన్నారు. ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయించిన స్థలంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఐదేళ్ల లో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలకూ నోచుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల అభివృద్ధికి చర్యలు చేపడుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, తహాశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నర్సింహ ప్రసాద్ పండా, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, బి.లక్ష్మీనారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర రెడ్డి, టిడిపి జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, అనపాన రాజశేఖరరెడ్డి, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తలసేమియా రక్తమార్పిడి కేంద్రం ప్రారంభం

ఆన్‌లైన్‌లో ప్రారంభించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో తలసేమియా రోగులకు రక్తమార్పిడి కేంద్రాన్ని రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన ప్రారంభించారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆన్‌లైన్‌లో గవర్నర్, రాష్ట్ర రెడ్‌క్రాస్ అధ్యక్షుడు అబ్దుల్ నజీర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తలసేమియా బాధితుల కోసం రక్తమార్పిడి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్య సేవలందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కోసం ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రెడ్‌క్రాస్ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. శాఖ చేపట్టిన సేవా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రతి బుధవారం తలసేమియా బాధిత పిల్లలకు రక్తమార్పిడి జరుగుతుందని తెలిపారు. అవసరమైన వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. రానూపోనూ రవాణా ఖర్చులు, పౌష్టికాహారం కూడా రెడ్‌క్రాస్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆరుగురు తలసేమియా బాధితులకు రక్త మార్పిడి చేపట్టారు. శివానీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌కు చెందిన 30 మంది విద్యార్థులు వీరికి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ డాక్టర్ కె. సుధీర్, కోశాధికారి కనుగుల దుర్గాశ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' సంఘీభావ ర్యాలీ

పలాస : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష

పలాస : భారతదేశాన్ని అస్థిరపరిచే ఏ దేశానికైనా ఇటువంటి గుణపాఠం తప్పదని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పాకిస్థాన్‌లో తలదాచుకున్న ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూరుకు మద్దతుగా పలాస జీడి వ్యాపారుల సంఘం ఆధ్వర్యాన గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని వ్యాపారులకు మద్దతు తెలిపారు. స్థానిక ఇందిరాగాంధీ కూడలి నుంచి జీడి పండు కూడలి వరకు వ్యాపారులు జాతీయపతాకాన్ని పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్, కార్యదర్శి టంకాల రవిశంకరుగుప్తా, కోశాధికారి మల్లా సంతోష్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను భారత సైన్యం మెరుపు దాడులు చేసినందుకు భారత సాయుధ దళాలకు అభినందనలు తెలియజేస్తూ మద్దతుగా టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్‌టిఆర్ పార్కు దగ్గర నుంచి రైతుబజారు వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికులు, మండల ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొని భారత సైనికులకు మద్దతు తెలిపారు.

శ్రీకాకుళం: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు జరిపి దేశ సైనిక బలగాలకు ప్రతి పౌరుడూ అండగా నిలవాలని స్టార్ వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు గేదెల ఇందిర ప్రసాద్ అన్నారు. నగరం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జైజవాన్, జైకిసాన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు గుప్త, బి.వి.రవిశంకర్, గుడ్ల జగ్గారావు, డాక్టర్ జి.ఎన్.రావు, చిన్నారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్

కొత్త కార్డుల కోసం 86 దరఖాస్తులు

జిల్లాలో నత్తనడకన సాగుతున్న నమోదు ప్రక్రియ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అర్హులైన పేదలకు బియ్యం కార్డులు జారీ చేసేందుకు ఈనెల ఏడో తేదీ నుంచి ప్రభుత్వం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలి రోజు 40 దరఖాస్తులు రాగా, గురువారం 46 అప్లికేషన్లు వచ్చాయి. కొత్త కార్డులను అందించడంతో పాటు కార్డుల్లో కుటుంబ సభ్యుల చేర్పులు, మార్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో అంతా ఆసక్తితో సచివాలయాలకు వస్తున్నారు. దీంతోపాటు కొత్త కార్డుల్లో కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామా మార్పు, రైస్ కార్డు విభజన, కార్డు సరెండర్, ఆధార్ సరిచేయడం వంటి అంశాలకూ అవకాశం కల్పించింది. కొత్త కార్డులు, మార్పులు, చేర్పుల కోసం చాలా కాలంగా వేచిచూస్తున్న వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాలకు వచ్చి తమ వివరాలను ఎపి సేవా పోర్టల్‌లో నమోదు చేసుకుంటున్నారు. జిల్లాలో నమోదు కార్యక్రమం రెండు రోజులుగా నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం ఈనెల ఏడో తేదీ నుంచే నమోదుకు అవకాశం కల్పించినా చాలాచోట్ల ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు. సర్వర్ పనిచేయడం లేదని కొన్నిచోట్ల తిప్పి పంపినట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల హడావుడిగా చేస్తే కార్డులు కోల్పోతారని, నిదానంగా చేద్దాం, తర్వాత రావాలంటూ సూచిస్తున్నారు. సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చిన పలురకాల టాస్క్‌లు అసంపూర్తిగా ఉండడంతో రకరకాల కారణాలు చెప్తున్నట్లు తెలుస్తోంది.

పోర్టు అధికారుల బరితెగింపు

దౌర్జన్యంగా భూమి చదును

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం కుర్మానాథపురంలో పోర్టు రైల్వే లైన్ కోసం భూముల సేకరణలో గురువారం ఉద్రిక్తత నెలకొంది. అదే గ్రామానికి చెందిన రైతు కోట రామ్మూర్తి తనకు ఉన్న 58 సెంట్ల భూమిని పోర్టు రైల్వే లైన్‌కు ఇవ్వలేదు. దీనిపై హైకోర్టులో కేసు ఉండగా పోర్టు అధికారులు... రెవెన్యూ అధికారులు, పోలీసుల సాయంతో ఆ భూమిని చదును చేశారు. ఈ ప్రాంతంలో సెంటు భూమికి ప్రభుత్వం రూ.25 వేల పరిహారం ఇచ్చింది. తనది మెట్ట భూమి అని, గత ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్‌లో పల్లం భూమి అని నమోదు చేశారని రైతు వాపోయారు. 120కి పైగా జీడి మామిడి, కొబ్బరి, బత్తాయి, టేకు చెట్లు ఉన్నాయని, అవార్డులో కూడా పల్లం భూమి అని చూపారని తెలిపారు. ఈ ప్రాంతంలో సెంటు రూ.1.50 లక్షలకు పైగా ఉంటే, రూ.25వేలు పరిహారం ఇవ్వడం ఏమిటని, పరిహారం సరిపోదని హైకోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టులో కేసు ఉంటే దౌర్జన్యంగా రెవెన్యూ అధికారులు, పోలీసులు, పోర్టు సిబ్బంది యంత్రాలతో మెట్టు భూమి చదును చేసి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

రామ్మూర్తి స్థలంలో యంత్రాలతో చదును చేస్తున్న పోర్టు సిబ్బంది

16 నుంచి జీడి కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పలాస

వేతన ఒప్పందంపై చర్చలు కొలిక్కి రాకుంటే ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి నుంచి జీడి కార్మికులు సమ్మెకు దిగుతారని జీడి కార్మిక సంఘం అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి తెలిపారు. ఈమేరకు సమ్మె లేఖలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా కార్మికశాఖ అధికారి, కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణకు గురువారం అందించారు. అనంతరం కృష్ణమూర్తి విలేకరులతో మాట్లాడుతూ వేతన ఒప్పందం గడువు ముగిసినా జీడి వ్యాపారుల్లో స్పందన లేదని విమర్శించారు. రెండేళ్లకోసారి నూతన వేతన ఒప్పందం చేసుకోవాల్సి ఉన్నా, ఆ దిశగా యాజమాన్యాల్లో స్పందన ఉండడం లేదని విమర్శించారు. నూతన వేతన ఒప్పందంపై రెండుసార్లు సమావేశమైనా చర్చల్లో పురోగతి లేదన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనాలనే మరో రెండేళ్లు కొనసాగిస్తామని జీడి వ్యాపారులు చెప్తున్నారని తెలిపారు. దీన్ని తాము అంగీకరించలేదన్నారు. ఈనెల 16వ తేదీన చర్చలకు నిర్ణయించామని, ఆరోజున వేతన ఒప్పందం కుదరకుంటే సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. న్యాయపరమైన వేతన ఒప్పందానికి వ్యాపారులు అంగీకరించాలని కోరారు.

ఎమ్మెల్యే శిరీషకు సమ్మె లేఖ అందిస్తున్న కార్మిక సంఘ నాయకులు కృష్ణమూర్తి

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామమని, అభ్యంతరాలు తెలపాలని డిఇఒ తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల పరిధిలోని ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులు కల్పించడానికి వీలుగా ఉంచామన్నారు. వెబ్‌సైట్ లింక్ https://www.sites.google.com/site/deosklorg లో ఉన్న సీనియారిటి జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 10లోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో సమర్పించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ యాజమాన్యంలో స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందడానికి సీనియారిటీ జాబితా ఆర్‌డి వెబ్‌సైట్ https://www.rjdsevsp.comలో అందుబాటులో ఉందని వివరించారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పిడిఎస్ రెండో దశ రవాణాకు టెండర్లు

శ్రీకాకుళం : రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ జిల్లా పరిధిలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల రెండో దశ రవాణా నిమిత్తం ఈ-టెండర్ నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2027 మార్చి 31వ తేదీ వరకు రవాణా కాంట్రాక్టర్లను నియమించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 13 మండల స్థాయి గోదాముల నుంచి సంబంధిత మండలాల చౌక ధరల దుకాణాలు, గ్రామ, వార్డు సచివాలయాల వరకు డోర్ డెలివరీ విధానాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. టెండర్ వివరాలను ష్ట్రజూం:7/వఅఎవతీ.ఖజూవ-జూతీశీ౪బతీవవవ‌్.స్ర్తశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల సంస్థలు రూ.ఐదు వేల డిడితో టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈనెల ఏడో తేదీన డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభమైందని, 12వ తేదీ సాయంత్రం నాలుగు గంటలతో డౌన్‌లోడ్ ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4.30 గంటల వరకు టెండరు సమర్పణ గడువు ముగుస్తుందని, టెక్నికల్ బిడ్‌ను సాయంత్రం 5.30 గంటలకు తెరుస్తారని తెలిపారు. ఈనెల 13న 11 గంటలకు ఆర్థిక బిడ్ తెరుస్తారని పేర్కొన్నారు. జి.సిగడాం, ఆమదాలవలస, జలుమూరు, కొత్తూరు, మెళియాపుట్టి, శ్రీకాకుళం, టెక్కలి, నరసన్నపేట, పలాస, ఇచ్ఛాపురం, కంచిలి, సరుబుజ్జిలి, లావేరు మండలాలకు టెండర్లను పిలుస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7732098637 ఫోన్ నంబరును సంప్రదించవచ్చని సూచించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పరిశ్రమలు స్థాపనతోనే పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో మైక్రో, స్మాల్, మిడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఇ) పార్క్‌కు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047ను సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన దశలవారీ కార్యాచరణలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఓ ఎంఎస్ఎంఇ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా పలాసలోని ఈ పార్క్ యువతకు ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలు అందిస్తుందని చెప్పారు. ఎంఎస్ఎంఇ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచే సంపద సృష్టించే దిశగా ఆలోచించడం ముఖ్యమంత్రి విశిష్టత అన్నారు. ఉద్యోగాల కోసం వెతకడం కాదు, ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ప్రజలను తీసుకెళ్లాలన్నదే సిఎం ఆలోచన అని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పలాస పారిశ్రామికంగా గుర్తింపు పొందేలా ఈ పార్కు మార్గం చూపుతుందన్నారు.

ఎపిఐఐసి డిప్యూటీ జోనల్ మేనేజర్ జయచంద్ర వివరాలు మాట్లాడుతూ రామకృష్ణాపురంలో 60.84 ఎకరాల భూమిని పార్కు అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అప్పగించిందన్నారు. కేంద్ర ఎంఎస్ఎంఇ మౌలిక వసతుల అభివృద్ధి పథకంలో భాగంగా రూ.12.50 కోట్ల వ్యయంతో 76 పారిశ్రామిక ప్లాట్లతో ఈ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. ప్రాజెక్టుకు 70 శాతం నిధులు కేంద్రం, 30 శాతం రాష్ట్రం ఇస్తామన్నారు. రూ.96 కోట్ల పెట్టుబడితో యూనిట్లు వస్తే, 1500 మందికి ప్రత్యక్షంగా, మరో 500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పార్కులో ప్లాస్టిక్ రీసైక్లింగ్, గ్రాన్యూల్స్, ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కారుగటెడ్ బాక్స్‌లు, డ్రై వాష్ యూనిట్లు, పేపర్, ప్యాకింగ్ ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ ఈ పార్కు ఏర్పాటుతో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. పార్కులో రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్, నీటి వసతి వంటి మౌలిక వసతులు పూర్తిగా సిద్ధం చేస్తామన్నారు. పరిశ్రమలు సులభంగా ఏర్పాటయ్యేలా సింగిల్ విండో ద్వారా అన్ని అనుమతులు పొందే అవకాశం ఉంటుందన్నారు. డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు సమర్పించి దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. ప్లాట్ల ధరలను ప్రభుత్వం త్వరలో నిర్ణయిస్తుందన్నారు. అప్లికేషన్ ప్రక్రియను వెబ్‌సైట్ ద్వారా ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రూపవతి, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, పోలాకి పాపారావు, కొత్తకోట తిరువలరావు, డొక్కరి శంకర్, కుత్తుమ లక్ష్మణరావు, తాళాసు శ్రీను, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్కు చెందిన ఎల్ఐసి ఉద్యోగులందరూ పాల్గొంటున్నట్లు స్థానిక బ్రాంచ్ కమిటీ అధ్యక్షులు ఆర్.సురేష్బాబు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో సమ్మె పోస్టర్ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి, ఎల్ఐసిలో ప్రభుత్వ వాటాల అమ్మకానికి, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జిఎస్టి ఎత్తివేయాలన్నారు. 3,4 తరగతుల ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. కొత్త పెన్షన్ పథకం రద్దు చేసి ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పథకం అమలు చేయాలన్నారు. స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.మాధవరావు, డి.వి.శ్రీనివాసరావు, ఎల్.శ్రీనిధి, బి.ఉమామహేశ్వర, ఎల్.పార్థసారథి, రెడ్డి చిరంజీవి, అనిల్, వేణు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న పద్మ, రజియా బేగం

ఎఎన్ఎం, సూపర్వైజర్ల నిరసన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

గత కొన్ని రోజులుగా ఆందోళన బాట పట్టిన ఎంఎల్హెచ్పిలు తమ కోర్కెల సాధన కోసం పోరాడుతూ తోటి ఉద్యోగులైన ఎఎన్ఎం, సూపర్వైజర్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, వారి వ్యాఖ్యలు ఎఎన్ఎం, సూపర్వైజర్లను కించపరిచేవిగా ఉన్నాయంటూ తమ నిరసన వ్యక్తం చేశారు. గురువారం ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎం, సూపర్వైజర్ల సంఘం ప్రతినిధులు వైద్యాధికారి డా. గంగా ప్రియ దర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం, సూపర్ వైజర్ల సంఘం ప్రతినిధులు రజియా బేగం, పిహెచ్ఎన్ పద్మ మాట్లాడుతూ ఎంఎల్హెచ్పిలుగా చేరిన అర్హత దశాబ్దాల పాటు సర్వీసు చేయడం వల్ల సీనియారిటీ వస్తుందని, జీతాలతో పాటు సూపర్ వైజర్లకు అర్హతలే రావన్న వ్యాఖ్యలు సరికావన్నారు. ఇటీవల సర్వీసులో చేరిన ఎంఎల్హెచ్పిలు సీనియర్ ఉద్యోగులను గౌరవించాలన్న ఆలోచన లేకుండా గౌరవానికి భంగం కలిగించే రీతిలో అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. తక్షణమే వారి వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎఎన్ఎంలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు. అనంతరం పిహెచ్సి ఎదుట నిరసన తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

ఎస్సి వర్గీకరణతో ఒడియాలకు అన్యాయం

ప్రజాశక్తి- కవిటి

ఎస్సి వర్గీకరణతో గ్రూప్ 1లోని రెల్లి, పైడి, దండాసి, హడ్డి, పనో మాదలుగ ఉన్న 12 ఒడియా మైనార్టీ ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్ కేటాయించి తీరని అన్యాయం చేసినట్టు ఆ తరగతి చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు వాపోయారు. ఈ మేరకు తమకు న్యాయం జరిగేలా చూడాలని ఉత్తరాంధ్ర ఒడియా మైనార్టీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ పాడికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు విద్యాపరంగా, డిఎస్సి, వివిధ స్థానిక ఉద్యోగ నియామకాల్లో రాష్ట్ర యూనిట్ రిజర్వేషన్ కాకుండా సుప్రీంకోర్టు, ఒఎంసి కమిషన్ నివేదిక ప్రకారం జిల్లా యూనిట్గా రిజర్వేషన్ పరిగణంలోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. 2025 డిఎస్సిలో పాత రోస్టర్ విధానం పాటించి కొత్త రోస్టర్ విధానం పాటించకోకపోవడంతో ఎస్సి గ్రూప్ 1లో ఉన్న అభ్యర్థులుకు ఒక్క పోస్ట్ కూడా కేటాయించలేదని అన్నారు. దీంతో అందులో ఉన్న ఒడియా మైనార్టీ ఉపకులాలకు తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా ఒడియా మైనార్టీ ఎస్సిలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఒడియా మైనార్టీ ఎస్సిల అధ్యక్షుడు ఎన్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి మురళీనాయక్ లావణ్య పాట్టిక, కె.శ్యామ్సుందర్, దుర్యోధన నాయిక, గోవింద్ నాయక్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మస్తర్ కార్యాలయం వద్ద మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. తమ డిమాండ్ల పరిష్కరించాలని నినాదాలు చేశారు. అంతవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నా యూనియన్ నాయకులు రమేష్కుమార్ పట్నాయక్, మంగళ్ సత్తు, గంగాధర్ రథో, ఢిల్లీ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘ అధ్యక్షునిగా తాతయ్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా గొర్రెల పెంకందారుల సహకార సంఘం నూతన అధ్యక్షునిగా కుజ్జ తాతయ్య ఎన్నికయ్యారు. గురువారం జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో సహకార సంఘం పాలకవర్గం ఎన్నికలు జరిగాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాలకవర్గ సభ్యులతో పాటు నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డా. పి.రామ్మోహనరావు వ్యవహరించారు. ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డా.బి.యోగేశ్వరరావు, పర్సన్ ఇన్చార్జి డా.టి.పి మనోజ్కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. డి.శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. నూతన అధ్యక్షులుగా తాతయ్య, ఉపాధ్యక్షునిగా పల్లా నరహరి ఎన్నికయ్యారు. అలాగే డైరక్టర్లుగా పల్లా ఎర్రన్నాయుడు, బూర పాపారావు, పిట్ట రాజారావు, కొర్నాన. చిట్టోడు, పాలిన కృష్ణారావు, రేగాన తిరుపతిరావు, తుర్ల కృష్ణారావు, వంజరాపు అడవయ్య, పల్లా రాజారావులు డైరక్టర్లుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పశుసంవర్ధక శాఖ జెడి డా. కె.రాజ గోపాలరావు తదితరులు అభినందించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

రణస్థలం రూరల్: బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కిల్లి అప్పలనాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడల్లో రాణించాలని, ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు వేసవి సెలవుల్లో ఇటువంటి పోటీలను నిర్వహించడంపై నిర్వాహకలను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆమదాలవలస పట్టణం క్రీడలకు పుట్టినిల్లు అని అన్నారు. యువతలో క్రీడలపై ఆసక్తి పెరగాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వలన యువతకు ఆరోగ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, కిల్లి శేషు, కిల్లి సిద్దార్థ్, జగన్, పొన్నాడ ఉగ్ర నరసింహ, గోవింద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: యువతకు క్రీడలపై ఆసక్తి పెరగాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలం పైడిభీమవరం పంచాయతీలో సురేష్ వర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతంతా ఆటలు, పాటలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని భవిష్యత్ను మెరుగు పరుచుకోవాలన్నారు. క్రీడల వలన యువతకు ఆరోగ్యంతో పాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. యువత మత్తు పానీయాలకు, గంజాయి వంటి మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భవిష్యత్ను తీర్చిదిద్దుకోవాలన్నారు. అలాగే అర్జునవలస పంచాయతీ గిరివానిపాలెంలో శ్రీ బంగారమ్మ తల్లి గ్రామదేవత పండగ సందర్భంగా గ్రామస్తులంతా కలిసి క్రికెట్, వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్లు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గొర్లె లక్ష్మణరావు, సురేష్ వర్మ, సుశీల వర్మ, సతీష్, పిన్నింటి భానోజీ నాయుడు, పిసిని జగన్నాథం నాయుడు, వడ్డాది శ్రీను, ముల్లు కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

రేపు సమావేశం

ఇచ్ఛాపురం : రోటరీ క్లబ్ ఆధ్వర్యాన పట్టణంలోని శ్మశాన వాటిక అధునాతనమైన సౌకర్యాలు కల్పిస్తూ... నిర్మించనున్న కొత్త నిర్మాణానికి పుర ప్రజల నుంచి సలహాలు సూచనలు స్వీకరిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజకుమార్, పి.దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న మధ్యాహ్నం 3.30 గంటలకు రోటరీ కళ్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజలు హాజరై తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

వరి విత్తనాల విక్రయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని నైరా ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ కళాశాలలో వరి విత్తనాలు అమ్మ బడుతున్నాయని వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ ఎం.భారతి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటియు 7029 (స్వర్ణ), 1121 (శ్రీదుర్గి), 1061 (ఇంద్ర), 1064 (అమర), 1318, 1124 (మార్టూరి సాంబ), బిపిటి 5204 (సాంబ మసూరి), ఆర్జిఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) వీటితో పాటు ఫైన్గ్రెన్ 30 కేజీల బ్యాగ్ 1410, కోర్సు గ్రైన్ 2537 30 కేజీల బ్యాగ్ 1260 ఆవరణలో అమ్మ బడుతున్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిత్రపటాలు స్వీకరిస్తున్న సినీగాయకులు శ్రీకృష్ణ, యామిని

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం: సినీ అభిమానులకు, సంగీత ప్రియులకు తమ గాత్రంతో ఉర్రూత లూగిస్తున్న నేపథ్య గాయకులు శ్రీకృష్ణ, యామిని గురువారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో వారికి స్వామివారి శేష వస్త్రాలతో పాటు చిత్ర పటాలను అందజేశారు.

మురపాక బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న తహశీల్దార్ బృందం

మురపాక బైపాస్ రోడ్డు పరిశీలన

లావేరు: మండలంలోని మురపాక నుంచి కేశవరాయునిపాళెంలో పెంట గ్రామాలకు వెళ్లే రహదారి మురపాక గ్రామం నుంచి ఇరుగ్గా ఉండడంతో వాహనాలు, ప్రయాణికులు, లారీలు, భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో ఇటీవల కేశవరాయునిపాళెంలో కార్యక్రమానికి వెళ్లిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుకు ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రాన్ని అందించారు. వెంటనే ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులను మురపాకలో బైపాస్ రోడ్డుకు సర్వేచేయలని ఆదేశించారు. దీనిపై గురువారం తహశీల్దార్ మంగం రాజశేఖర్, మండల సర్వేయర్ బచ్చు శ్రీధర్ రెడ్డితో కూడిన అధికారుల బృందం గుంటుకుపేట కూడలి నుంచి మురపాక గ్రామం ప్రక్కనుంచి పిహెచ్సి వరకు గోర్జు మట్టి బాటను ప్రాథమికంగా పరిశీలన చేశామని తహశీల్దార్ తెలిపారు. పెదరావుపల్లి రెవెన్యూలో రెండు సర్వే నెంబర్లు, మురపాక రెవెన్యూలో ఏడు సర్వే నెంబర్లు పరిధిలో సుమారు 1.5 కిలోమీటర్లు మేర బైపాస్ రోడ్డు ప్రభుత్వ భూమి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, రత్నాకర్, విఆర్ఒ మలేశ్వరరావు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని మాణిక్యపురం 11కెవి ఫీడర్ పరిధిలో ఆర్డిఎస్ఎస్ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అందులోభాగంగా మాణిక్యపురం, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 5 గంటల వరకు బోరివంక ఫీడర్లోని లోళ్లపుట్టుగలో పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పి.ఎల్ పురంలో అమ్మవారి వేడుకలు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురంలోని నీలమణి దుర్గ అమ్మవారి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంపై చిత్రకళను అభివృద్ధి చేశారు. అలాగే అమ్మవారి పాదాలను ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన లూకలాపు లోహితచ్ఛుడు, జ్యోతి తన సొంత నిధులతో అభివృద్ధి చేశారు. గ్రామస్తులు ఒక్కసారిగా వచ్చి ముద్రాటాలు ఇచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

లక్ష్మీపురంలో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

లక్ష్మీపురం డీలరుపై విచారణ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని లక్ష్మీపురం రేషన్ డీటర్ మాకొద్దని, ఎంత మ్త్రారం సరుకులు తాము తీసుకోమని విచారణ అధికారుల ముందు లక్ష్మీపురం గ్రామస్తులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. లక్ష్మీపురం రేషన్ డీలర్ దల్లి రమణమ్మకు వ్యతిరేకంగా ఇటీవల గ్రామస్తులంతా ఇటీవల తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అవినీతి డీలర్ను వెంటనే తొలగించి వేరొక డీలర్ని లేదా స్వయంశక్తి గ్రూపునకు అయినా రేషన్ దుకాణాన్ని అప్పగించాలని వారంతా డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. తహశీల్దార్ మంగం రాజశేఖర్ గ్రామంలో విచారణ చేసి నివేదిక ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. అయితే గురువారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాపర్తి అప్పలరాజు, విఆర్ఒ మలేశ్వరరావుతో కూడిన విచారణ బృందం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా అవినీతికి పాల్పడిన రేషన్ డీలర్ని కాకుండా ఇంకో డీలర్ను నియమించాలని, స్వయంశక్తి సంఘానికి అయిన అప్పగించాలని డిమాండ్ చేశారు. అదే డీలర్ను కొనసాగిస్తే తాము సరుకులు తీసుకోబోమని తేల్చి చెప్పారు. నివేదికను తహశీల్దార్కు అందజేస్తామని విచారణ అధికారులు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ నివేదిక ఉన్నతాధికారులకు అందించి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతు సంక్షేమంలో భాగంగా సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఉపాధి హామీ నిధులు రూ.1.65 కోట్లతో చేపట్టనున్న 25 పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే వంశధార శివారు భూములకు సాగునీరు అందించామన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో చుక్క నీటికి నోచుకోని రైతులు సాగునీటి కష్టాలు చూశారని అన్నారు. వంశధార పరిధిలోని సాగునీటి చెరువుల నుంచి వృథా నీటిని అరికట్టి ప్రతినీటి బొట్టు వినియోగంలోకి తీసుకొని రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. మదుములు, పరువులు, చప్తాలు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, వంశధార డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ గొనప నిరంజన్, దుంపల వల్లభరావు, దువ్వాడ అప్పారావు, ఎ.ఉమామహేశ్వరరావు, శంకర్, కణితి సురేష్, పోతనపల్లి సాంబమూర్తి, కోనారి కిరణ్కుమార్, వంశధార ఇఇ శేఖరరావు, ఎంపిడిఒ ఎన్.రమేష్నాయుడు, ఎపిఒ అరుణ్కుమార్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రామారావు

'వాట్సాప్ గవర్నెన్స్'పై అవగాహన

ప్రజాశక్తి- పలాస

ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అనే ఉద్దేశంతో ప్రభుత్వం 'మనమిత్ర యాప్'ను ప్రవేశపెట్టిందని కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో అన్ని సచివాయాల కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనమిత్ర యాప్ ద్వారా మన ఇంటిలో నుంచే మన ఫోన్ ద్వారా ప్రభుత్వ సేవలు అన్నిటిని పొందేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వ సేవలు జనన, మరణ ధ్రువపత్రాలు, ఆస్తి పన్ను చెల్లింపు, కుళాయి కనెక్షన్ తీసుకోవడం, రిజిస్ట్రేషన్లు చేసుకోవడం, కుల ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చునని అన్నారు. అనంతరం పోస్టర్ను ఆవిష్కరించారు.

వన్ స్టాఫ్ సెంటర్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆపదలో ఉన్న మహిళలకు గృహహింస, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, బాలికలపై లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, మహిళలు, బాలికలు కిడ్నాప్, మహిళలపై సైబర్ నేరాలు ఇలాంటి బాధిత మహిళలకు చేయూత అందించేందుకు వన్ స్టాప్ సెంటర్ను ప్రారంభిందని కమిషనర్ తెలిపారు. పురపాక సంఘ కార్యాలయంలో వన్ స్టాప్ సెంటర్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఎవరైనా సహాయం పొందాల్సిన వారు టోల్ ఫ్రీ నంబరు 181కు కాల్ చేసి సహాయం పొందవచ్చునని తెలిపారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ

ప్రజాశక్తి- కవిటి

భారతీయ విద్యాకేంద్రం వారి ఆర్ష విజ్ఞాన భారతి కవిటి పాఠశాలలో 15 రోజులపాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిబిరంలో విద్యార్థులకు ఘోష్పై శిక్షణ ఇచ్చారు. భారతీయ పురాతన సంగీతమైన ఘోష్లో శంక, వేణువు, జలరీ, త్రిబుజ, ప్రణవపై శిక్షకులు బడే లోకనాథ్, దసరాజు, బడే మాదికమ్మా విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనిల్, శిరీష, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి వినోద కార్యక్రమంలో భాగంగా సంప్రదాయ జానపద ఆటలపై శిక్షణను ఇచ్చారు. అంతరించిపోతున్న సాంప్రదాయ జానపద ఆటలను నేటితరం బాలబాలికలకు అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతిరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యాన రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు యోగా, తదితర 20 రకాల సాంప్రదాయ ఆటలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాస్కరరావు, ఆదికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : ఆటలో నిమగ్నమైన విద్యార్థినులు

నిత్యావసర సరుకులు అందజేత

ఎచ్చెర్ల: రెండు నిస్సహాయ కుటుంబాలకు అండగా వెల్కమ్ సేవా ఫౌండేషన్ అండగా నిలిచిందని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా. టి.మణికంఠ అన్నారు. మండలం, అజ్జరాం పంచాయతీకి చెందిన టెంక రమేష్ రోజువారీ కూలి పని చేసుకుంటూ అనారోగ్య కారణంగా స్థానిక రిమ్స్ వైద్యశాలలో వైద్యం చేయించుకుంటూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఇంటి పెద్దదిక్కు కావటంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి దీనంగా మారటమే కాకుండా, కనీసం తినడానికి కూడా ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకొని, రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు, కొంత నగదును గురువారం ఆ కుటుంబ సభ్యులకు అందించామని వెల్కమ్ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తాతారావు తెలిపారు. అలాగే డి.మత్స్యలేశం పంచాయతీలో కె.మత్స్యలేశం గ్రామానికి చెందిన నవీన్ అనే నిస్సహాయ కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు ఆర్థికసాయాన్ని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠ చేతులమీదుగా అందించామన్నారు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ వెల్కమ్ సేవా ఫౌండేషన్ సేవలు కొనసాగాలని, ఎచ్చెర్ల మండల పరిధిలో ఎవరికి ఏ అవసరమున్నా వెల్కమ్ సేవా ఫౌండేషన్ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ బి.మురళీమోహన్, సెక్రటరీ దాలిబాబు, ట్రెజరర్ మూర్తి, సురేష్, లక్ష్మణరావు, తాతారావు, అప్పన్న, మాధురి, రమేష్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంజీవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆంధ్రరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత దామోదరం సంజీవయ్య వర్ధంతి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు హాజరై పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసిన దళిత వ్యక్తి సంజీవయ్య అని కొనాయాడారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సాయిదుల్లా ఖాన్, బి.సంజీవరావు, పాల రమేష్ కుమార్, అనుపోజు రవికుమార్ పాల్గొన్నారు.

దళిత సంఘం ఆధ్వర్యంలో

దేశం గర్వించదగ్గ నేత దామోదరం సంజీవయ్య అని దళిత సంఘాల నాయకులు డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీనులు పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడని కొనియాడారు. సంజీవయ్య మెమోరియల్ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎయిమ్స్, దళిత సంఘాల నాయకులు పురుషోత్తం, రాంబాబు, పెయ్యల చంటి, నేతల అప్పారావు, కొత్తూరు సత్య న్నారాయణ, సాకేటి నాయుడు, నందేసు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నివాళ్లర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

రాపాకలో టిబి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

18 మందికి టిబి పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక, పొందూరులో కింతలి, తాడివలస పిహెచ్సి వైద్యాధికారులు శివశంకర్, నవీన్ ఆధ్వర్యంలో గురువారం సివై-టిబి స్కిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో టిబి ఉన్న కుటుంబాల్లోని 18 మందికి ఈ పరీక్షలను జరిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వారం కంటే దగ్గు ఎక్కువుగా ఉన్నా, బరువు కోల్పోవడం, తరుచుగా జ్వరం రావడం ఉన్నట్టయితే తప్పనిసరిగా పరీక్షలు చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రాంప్రసాద్, హేమలత, హెల్త్ అసిస్టెంట్లు లక్ష్మీనారాయణ, రమణ, ఎఎన్ఎంలు ఉదయ్లక్ష్మి, చిన్నమ్మడు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఎంఎల్హెచ్పిల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్లినిక్లను నిర్వహిస్తున్న ఎంఎల్హెచ్పిల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరుతూ యూనియన్ ప్రతినిధులు జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్ర మోహన్కు వినతిపత్రం అందజేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యలను వివరించారు. గడచిన కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ఆరేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు క్లినిక్ల ద్వారా సేవలు అందిస్తున్నామని ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో కూడిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ కోర్సు పూర్తి చేసి ఉద్యోగాల్లో చేరినా ఎటువంటి సౌకర్యాలు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్దిష్టమైన జాబ్చార్ట్ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్హెచ్పి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజీవ్, జిల్లా అధ్యక్షులు ఉషారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందుమతి, ఉపాధక్షులు జ్యోతి పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఎంపిడిఒ లక్ష్మీభాయి

'ఉపాధి' పనులపై సమీక్ష

టెక్కలి రూరల్: ఫారం పాండు, మొక్కల పెంపకం, గోశాలలు, పశువుల నీటితొట్టి నిర్మాణం, కంపోస్టు పిట్, ఇంకుడు గుంతల పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ సిహెచ్.లక్ష్మీభాయ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, పశుసంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఉద్యానవనశాఖ, గ్రామాణి ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమీక్షించారు. సమావేశంలో ఇఒపిఆర్డి కె.సింహాద్రి ఎంపిడిఒ బగాది ప్రసాదరావు, మండల ఇంజినీర్ ఎస్.ఎల్. నాయడు పాల్గొన్నారు.

పలుచోట్ల అన్నదానం

ఆమదాలవలస: పట్టణంలోని మోణింగి వారి వీధిలో నున్న అయ్యప్ప స్వామి దేవాలయం ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అలాగే మండలంలోని బైరిశాస్త్రులపేటలో శ్రీ ఎండల మల్లికార్జున స్వామి 72వ కళ్యాణ వార్షికోత్సవంలో లంక ఆదినారాయణ, శారద, మొండేటి గోవిందరాజు, తారకేశ్వరి దంపతులతో ఆలయంలో కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యోగాతో మానసిక ప్రశాంతత

లావేరు: యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత వస్తుందని, తద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని యోగా నిపుణులు శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు, యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు ప్రతిరోజు యోగా చేసినట్లయితే మానసిక ప్రశాంతతతో పాటు శరీరం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

కోటబొమ్మాళి: మండలంలోని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మండల డిప్యూటీ ఎంపిడిఒ జి.అనందరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ, వ్యవసాయ, నీటిపారుదల, ఆర్డబ్ల్యుఎస్, పశుసంవర్ధకశాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేసి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీరు వృథా

కవిటి: చాలా ప్రాంతాల్లో తాగునీరు లేక ప్రజలు అల్లాడుతుంటే అన్ని సదుపాయాలు ఉన్న కొన్ని ప్రాంతాల్లో కేవలం నిర్లక్ష్యం వల్ల తాగునీరు వృథాగా పోతోంది. మండ లంలోని ఇద్దివానిపాలెంకు వెళ్లే ఉద్దానం పైపులైన్ బ్రిడ్జి వద్ద లీక్ అవ్వడంతో పది రోజులుగా తాగునీరు వృథాగాపోతోంది. దీనిపై స్థానికులు సంబంధిత సిబ్బందికి సమాచారం అందించినా ఫలితం లేకపోతోంది. దీంతో ఎంతో విలువైన తాగునీరు పరలో కలిసిపోతోంది. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి మండు వేసవి కాలంలో నీటి వృథా చర్యలు అరికట్టి సక్రమంగా తాగునీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఇద్దివానిపాలెం బ్రిడ్జి వద్ద వృథాగా పోతున్న తాగునీరు